క్లుప్తంగా

వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభం



హెల్త్ క్లినిక్ ప్రారంభంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది

సదుం: పాత సీహెచ్‌సీ భవనంలో తాత్కాలిక వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను మంగళవారం ప్రారంభించారు. కేంద్రంలో పూజా కార్యక్రమాల అనంతరం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడారు. పేదల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జానకి, హెల్త్ సూపర్‌వైజర్లు నీలకంఠ, ఉదయ భాస్కర్, శిఖామణి, సీహెచ్‌ఓ రషీద్, దీప, ఏఎన్‌ఎం హేమలత పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల సేవలు భేష్



అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందితో ఢిల్లీ డాక్టర్ల బృందం

పుంగనూరు: పట్టణంలో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వహణ, సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్స్ ఢిల్లీ బృందం డాక్టర్లు శ్రీనాథరెడ్డి, రాజేశ్వర్, నిరంజన్‌రెడ్డి కితాబిచ్చారు. పట్టణంలోని హెల్త్ సెంటర్లను బృందం పరిశీలించింది. రోగులు, సిబ్బందితో సమావేశమయ్యారు. సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ రిజిస్టర్లు, మందులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



ధ్వంసమైన బోరు బావిని చూపుతున్న బాధిత రైతు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లె పంచాయతీలో ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన ఏనుగు పెనుగొలకలకు చెందిన వెంకటరత్నం వ్యవసాయ బోరు బావిని ధ్వంసం చేసింది. బోరు పైపులను విరిచేసి మోటర్‌ను, కేబుల్ వైరును బోరు బావిలోకి తోసేసింది. అలాగే పెద్దకాప్పల్లెకు చెందిన రమణా రెడ్డి తదితరులు సాగు చేసిన వరి పంటను తొక్కి నాశనం చేసింది. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతులు ఏనుగు విధ్వంసాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. గజదాడిలో సుమారు రూ.50వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి గజదాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

2, 3న ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 2, 3వ తేదీలలో ప్రాజెక్టుల ఎగ్జిబిషన్, సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలతో పాటు కుప్పం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, బెంగుళూరుకు చెందిన సినోప్సిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన మొత్తం 70 ప్రాజెక్టులను ఈ సదస్సులో ప్రదర్శిస్తారన్నారు. ఈ సదస్సును జిల్లా విద్యాశాఖాధికారి ప్రారంభిస్తారని, ఎగ్జిబిషన్‌లో పలమనేరు నియోజకవర్గంలోని హైస్కూళ్ల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

తంబళ్లపల్లె ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె స్వగృహంలో ఉన్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని పలువురు నాయకులు బుధవారం కలిశారు. ఇటీవలే వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా ఎంపికైన మస్తాన్ ఆయనను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిని కలిశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సయ్యద్‌బాషా, మహమ్మదాలి, సైపుల్లా, హోటల్ బాబు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

టమాటా రైతుపై దౌర్జన్యం చేసిన వారిపై కేసు

పలమనేరు: మండలంలోని జరావారిపల్లెకు చెందిన టమాటా రైతు ఎన్ మునిరత్నం రెడ్డికి అందాల్సిన బిల్లుల విషయంగా ప్రశ్నించినందుకు మండీ యజమాని, అతని అనుచరులు దౌర్జన్యం చేసిన సంఘటనకు సంబంధించి ఐదుగురిపై పలమనేరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. గత నెల స్థానిక టమాటా మార్కెట్‌లో బిల్లుల విషయంగా గొడవ చోటుచేసుకోవడం విదితమే. మండీ యజమాని బాలాజీ, ఆయన అనుచరులు రమేష్, మునిరత్నం, క్రిష్ణ, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

వ్యవసాయానికి నాణ్యతతో ఉచిత విద్యుత్

- రూ.75కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణం
- ఇప్పటికే మూడు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- రూ.69 కోట్లతో 132కేవీ సబ్‌స్టేషన్ పనులు మొదలు



జీసీ పల్లె వద్ద నిర్మించిన సబ్‌స్టేషన్

పలమనేరు : నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ కోసం ట్రాన్స్‌కో రూ.75 కోట్లతో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మిస్తోంది. వచ్చే వేసవిలో మరింత నాణ్యంగా కరెంట్ సరఫరా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం దీనికి పూనుకుంది. ఆ మేరకు బైరెడ్డిపల్లె మండలంలోని గొల్లచీమనపల్లె, గంగవరం మండలంలోని గంగ్రాజుపల్లె, వీ.కోట మండలంలోని ఎర్రచేనుల వద్ద 33/11కేవీ సబ్‌స్టేషన్లను రూ.6 కోట్లతో నిర్మించారు. ఇటీవలే వీ.కోట మండలంలోని తోటకనుమ వద్ద రూ.69 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్ పనులు మొదలయ్యాయి. ఈ పనులు పూర్తయితే బైరెడ్డిపల్లె, వీ.కోట మండలాల్లో వ్యవసాయానికి నాణ్యమైన కరెంట్ అందనుంది. అలాగే, నియోజకవర్గంలో 25వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఓల్టేజి సమస్య తీరుతుంది.

నాలుగేళ్లుగా కరెంట్ సమస్యే లేదు



గత టీడీపీ ప్రభుత్వ పాలనలో వచ్చే మూడు గంటల కరెంట్లో పదిసార్లు ఫీజులు పోతుండేవి. లోఓల్టేజీతో పాటు లోడు ఎక్కువుండేది. సబ్‌స్టేషన్ల కాడ రైతులు ధర్నాలు చేస్తాఉంటిమి. అయితే పట్టించుకోలా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినాక సేద్యానికి కరెంట్ సమస్యేలేదు. నీళ్లు బాగుండాయి..మంచిగా పంటలు పండుతున్నాయి. నాలాంటి రైతులు సంతోషంగా ఉన్నాం.

– వెంకటరెడ్డి, రైతు, కల్లాడు, పలమనేరు మండలం

వ్యవసాయానికి ఇబ్బంది లేదు



పలమనేరు ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో వ్యవసాయానికి 9గంటల కరెంట్ సాఫీగా అందుతోంది. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో కాస్త వృథా కరెంట్ కారణంగా లో ఓల్టేజి సమస్య ఉంటుందనే కారణంగా ఇప్పుడు ప్రభుత్వం అదనంగా సబ్‌స్టేషన్లను నిర్మిస్తోంది. దీంతో పాటు అదనంగా వీ.కోట సమీపంలోని ఎర్రచేను వద్ద 33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే మళ్లీ ఎలాంటి సమస్య ఉండదు.

– చిన్నబ్బ, ట్రాన్స్‌కో ఏడీ, పలమనేరు

వీధి బాలల భవితకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న న్యాయమూర్తి సింధు

పుంగనూరు: వీధి బాలలను గుర్తించి వారికి చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని జూనియర్ సివిల్‌జడ్జి సింధు కోరారు. బుధవారం స్థానిక దోబీకాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌లో వీధి బాలలపై సదస్సు నిర్వహించారు. సింధు మాట్లాడుతూ, వీధి బాలల భవితకు తోడ్పాటునిచ్చే వారి సహకారంతో బాలలను సంక్షేమ హాస్టళ్లలో చేర్పించాలన్నారు. వారికో మంచి జీవితం ప్రసాదించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. వీధి బాలలను కార్మికులుగా వినియోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందేలా చేయడంతో పాటు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ గౌరీశంకర్, హెచ్‌ఎం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో బుధవారం సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. రాయలపేట మొండి వీధిలో రాజేశ్వరి, రాధ అనే ఇద్దరు మహిళలు సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు చేసి, వారి నుంచి ఐదు లీటర్ల సారా (50 ప్యాకెట్లు) స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. రిమాండు నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు.

4న జవునపల్లెలో వాలీబాల్ టోర్నీ

వి.కోట: మండలంలోని జవునపల్లె గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 4న వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విన్నర్స్‌కు రూ.9,999, రన్నర్స్‌కు రూ.7,777, మూడు, నాలుగవ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.3,333, రూ.2,222 నగదు బహుమతులుగా ఇవ్వనున్నట్టు తెలియజేశారు. ఆసక్తిగల జట్లు 3వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం సంప్రదించాల్సిన సెల్ నంబర్లు:6302169512, 8008009071.

లక్ష్యసాధనతో తల్లిదండ్రులకు పేరుతేవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శిల్ప

కుప్పం రూరల్: ఒక లక్ష్యం నిర్దేశించుకుని దానిని సాధించి తల్లిదండ్రులు, స్కూలుకు మంచి పేరు తేవాలని కేసీ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ శిల్ప అన్నారు. బుధవారం కుప్పం జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అందరూ టీనేజ్‌లో ఉంటారు కాబట్టి చదువుపై తప్పితే ఇతర వ్యాపకాలపై దృష్టి సారించరాదని విద్యార్థినులకు హితోక్తులు పలికారు. ఉపాధ్యాయుల గైడెన్స్‌తో బాగా చదవాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. నెలసరి సమయాల్లో ఎలా వ్యవహరించాలో, మగ పిల్లలతో ఎలా ఉండాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మంజునాథ్ పాల్గొన్నారు.

రైలులో కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితుడి అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

చిత్తూరు కార్పొరేషన్: రైలులో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కథనం... బెంగుళూరు నుంచి కాకినాడకు వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేశారు. బెంగుళూరు నుంచి బాపట్లకు వెళుతున్న ప్రయాణికుడు సుజిత్ (30) బ్యాగ్‌ను పరిశీలించగా కర్ణాటక మద్యం 16 ఫుల్‌బాటిల్స్ ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జగనన్న సురక్ష ప్రజలకో వరం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకో వరంలా మారిందని పలమనేరు మున్సిపల్ కౌన్సిలర్లు అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని స్థానిక వైద్యశాఖ అధికారులు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 450మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మండీ సుధా, కోదండరామయ్య, నయాజ్ మాట్లాడారు. ఏదేని ఆపరేషన్లు అవసరమైన పక్షంలో వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25లక్షల వరకూ ప్రభుత్వం ఉచితంగా ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, వైద్యులు నిరంజన్‌కుమార్, శాలిని, మరియమ్మ, వైద్య సిబ్బంది జైశంకర్ పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

- హోరాహోరీగా తలపడిన జట్లు
- ముగిసిన ఖో-ఖో, వాలీబాల్ పోటీలు



చిత్తూరు-పలమనేరు మహిళా జట్ల మధ్య కబడ్డీ ఫైనల్స్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో బుధవారం ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు కొనసాగాయి. జిల్లాలోని చిత్తూరు, పూతలపట్టు, నగరి, జీడీ నెల్లూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల నుంచి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడలకు పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నాయి. తొలిరోజు క్రీడాపోటీల్లో 40 మ్యాచ్‌లకు షెడ్యూల్ ఇచ్చారు. రాత్రి 9.30 గంటల సమయానికి 28 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. మిగిలిన మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు.

ఖో-ఖో విన్నర్స్ పలమనేరు, పూతలపట్టు

ఖోఖో పోటీలు రసవత్తరంగా సాగాయి. పురుషుల విభాగం ఫైనల్స్‌లో పలమనేరు-పూతలపట్టుపై విజయం సాధించింది. కుప్పం మూడవ స్థానంలో నిలిచింది. ఇక మహిళల విభాగం ఖో-ఖో ఫైనల్స్‌లో పూతలపట్టు-పలమనేరుపై గెలుపొందింది. మూడవ స్థానంలో జీడీ నెల్లూరు జట్టు నిలిచింది.


వాలీబాల్ విన్నర్స్ చిత్తూరు, పలమనేరు

వాలీబాల్ పోటీల్లో పలు నియోజకవర్గాల జట్లు తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన పురుషుల విభాగం ఫైనల్స్‌లో చిత్తూరు-పుంగనూరుపై విజయం సాధించింది. జీడీ నెల్లూరు జట్టు మూడవ స్థానంలో నిలిచింది. మహిళ విభాగంలో పోటీల్లో పలమనేరు-పూతలపట్టుపై గెలిచింది. నగరి మూడవ స్థానంలో నిలిచింది.


మహిళల కబడ్డీ విభాగం ఫైనల్స్‌లో రగడ..పుంగనూరు జట్టుపై వేటు

మహిళల విభాగం కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. అయితే ఫైనల్స్‌లో జట్ల నడుమ నడుమ వాగ్వాదాలు చోటుచేసుకుని చాలాసేపు పోటీలు నిలిచిపోయాయి. ఫైనల్స్ చిత్తూరు, పుంగనూరు జట్లు చేరాయి. అర్హత లేని ప్రాంతాలకు చెందిన వారు పుంగనూరు జట్టులో ఆడుతున్నారని చిత్తూరు మహిళల జట్టు ఆరోపించడంతో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. పుంగనూరు జట్టు క్రీడాకారిణులు ఆధార్‌కార్డులను చూపించినప్పటికీ వారిని ఎవ్వరూ పట్టించుకోలేదు.


చివరికి వారిని పోటీల నుంచి తొలగించి తదుపరి జట్టుతో పోటీలు ప్రారంభించారు. తర్వాత ప్రారంభమైన చిత్తూరు, పలమనేరు జట్ల మధ్య పోటీలు కొనసాగాయి. ఈ పోటీల్లో చిత్తూరు జట్టును విజేతగా ప్రకటించారు. బాలుర కబడ్డీ పోటీల్లో నగరి, పూతలపట్టు జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి.




చిత్తూరు-పలమనేరు జట్ల క్రీడాకారుల మధ్య జరుగుతున్న కబడ్డీ పోటీలు



ఖో-ఖో ఫైనల్స్‌లో తలపడిన పలమనేరు-పూతలపట్టు జట్ల క్రీడాకారులు



చిత్తూరు- పుంగనూరు క్రీడాకారుల మధ్య వాలీబాల్ ఫైనల్ పోటీలు



పలమనేరు-పూతలపట్టు మహిళల మధ్య వాలీబాల్ ఫైనల్స్

వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం



మహిళలకు చీరలు అందజేస్తున్న దుర్గ

కుప్పం రూరల్: రాబోవు ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి ఘన విజయం సాధించేలా ప్రజలు ఓట్లతో ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కోరారు. బుధవారం కుప్పం మున్సిపాలిటీ 10, 16వ వార్డుల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు పసుపు కుంకుమ, చీరలను అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా పేదలకందరికీ పథకాల ఫలాలు అందించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో 231 అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: మున్సిపాలిటీ 31వ వార్డుల్లో మురుగు కాలువల నిర్మాణం, రోడ్లు, వీధుల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించినట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా వెల్లడించారు. బుధవారం కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ సమావేశం నిర్వహించారు. అజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. చైర్మన్ మాట్లాడుతూ, మున్సిపాలిటి అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరైన నిధులతో వార్డులలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధించి మొత్తం 231 పనులను చేపట్టి, త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. అలాగే ఎంబీటీ రోడ్డు ఆక్రమణల తొలగింపు పూర్తయ్యిందని, త్వరితగతిన తారు రోడ్డు వేసి డివైడర్లు, ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రి, ఎంపీ సహకారంతో చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, అధికారులు పాల్గొన్నారు.

'ప్రజా సింహగర్జన' కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

రొంపిచెర్ల: స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట బుధవారం బీసీ సంఘ నాయకులు 'ప్రజా సింహగర్జన' సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆ సంఘ నాయకుడు నారాయణస్వామి మాట్లాడుతూ, రాబోవు ఎన్నికల్లో ఏపీలో 90 ఎమ్మెల్యే స్థానాలను బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 4న తిరుపతిలోని ఇందిరా మైదానంలో ప్రజా సింహగర్జన సభ నిర్వహించనున్నామని, దీనిని బీసీ కులాలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల ఏకరి సంఘం రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్‌నాయుడు, వడ్డెర సంఘ నాయకులు వెంకట్, నూరేషా, మలేపల్లె వెంకటేష్, రఘునాథ్, రాజేంద్రప్రసాద్, వీర శంకరయ్య, రాజ, చలపతి, అశోక్, చంద్రప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పౌర హక్కుల దినోత్సవం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ చిట్టిబాబు

వి.కోట: గ్రామాల్లో ప్రజలకు అన్ని చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుతూ సమస్యలను పరిష్కరించడానికి పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిట్టిబాబు అన్నారు. బుధవారం మండలంలోని యర్నంపల్లె, పాముగానిపల్లెలో తహసీల్దార్, ఎంపీడీఓ, సీఐ తమ సిబ్బందితో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తే కుటుంబం, గ్రామం, రాష్ట్రం ఎంత అభివృద్ధి బాటలో ఉంటుందో వివరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి? ఏ పథకానికి ఎవరు అర్హులో తెలియజేశారు. అనంతరం తమ దృష్టికి వచ్చిన వివిధ సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. కార్యక్రమంలో సీఐ లింగప్ప, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడికి పంపాలి



సమావేశం నిర్వహిస్తున్న మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు

పలమనేరు: బడిఈడు పిల్లలను పనుల్లో ఉంచకుండా వారిని విధిగా బడికి పంపాల్సిందేనని పట్టణానికి చెందిన న్యాయవాది సయ్యద్ మొహిద్దీన్ అన్నారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ పట్టణ సమీపంలోని షికారి కాలనీలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ, పిల్లలను పనుల్లో ఉంచే తల్లిదండ్రులు, పనుల్లో ఉంచుకున్న దుకాణ యజమానులకు బాల కార్మికుల చట్టం మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు భాస్కర్, ఆరీఫ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు, టీచర్లు

పలమనేరు: మండలంలో నక్కపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు యోగివేమన చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ట్రస్ట్ అధ్యక్షులు చెంగారెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలనే ఉద్దేశంతో ఈ స్టడీ మెటీరియల్ ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ నాయకులు భాస్కర్ రెడ్డి, బాలాజీరెడ్డి, హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు చెంగల్రాయన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం



శాంతిపురం: ఇజ్రాయిల్ దంపతులను సత్కరిస్తున్న సహచర సిబ్బంది



గంగవరం: రిటైర్డ్ టీచర్లను సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

గంగవరం: ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన జీడిమాకులపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజయ్య, పెద్దఉగిణి పాఠశాల ఉపాధ్యాయుడు చిన్నయ్యను బుధవారం స్థానిక ఎంఆర్‌సీ వద్ద ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి వారి సేవలను ప్రస్తుతించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 1, 2, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శాంతిపురంలో ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్‌కు..

శాంతిపురం: స్థానిక ఐటీఐలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఇజ్రాయిల్ జాకబ్‌ను సహచరులు, విద్యార్థులు బుధవారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థిని తన బిడ్డలా భావించి, తీర్చిదిద్దిన గొప్ప గుణం ఆయన సొంతమని ఆయన సేవలను ప్రస్తుతించారు.

ఇజ్రాయిల్ జాకబ్ మాట్లాడుతూ క్రమశిక్షణతో నడుచుకునే వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుతారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నగేష్, సిబ్బంది జోగి, లోకేష్, నీరజాక్షులు రెడ్డి, వెంకటేష్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దపంజాణి మండలంలో..

శివాడి పంచాయతీ కార్యదర్శికి..

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామ పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు. ఎంపీపీ రెడ్డెప్ప, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్, ఏఓ భాస్కర్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్, వైస్ సర్పంచ్ క్రిష్ణమూర్తి, పలువురు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.